క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో అందిస్తున్న సేవలపై శుక్రవారం ×డయల్ యువర్ డీఎం¥ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రయాణికులు పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఫోన్ నంబరు 99592 25536లో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నాగబాబు తదితరులు

మండపేట: ఏడిద సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. సొసైటీ చైర్మన్ శ్రీహరిబాబు, వై.సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, సొసైటీ సీఈఓ జగదీష్, పార్టీ నాయకుడు అడ్డాల రామారావు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: మండపేట రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం ఈనెల 11వ తేదీన జరుగనున్నట్టు సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు గురువారం ఒక ప్రకనలో తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో డీఆర్ వివరాలు, ఇన్‌కంటాక్స్, ఈకేవైసీ, లైఫ్‌సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి

రామచంద్రపురం: చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి సూచించారు. నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా గురువారం స్థానిక కోర్టుల ప్రాంగణంలో సిబ్బందికి, వలంటీర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి, జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయకులు చట్టాలపై పలు అంశాలు వివరించారు.

శివభగవాన్‌కు ఎంపీపీ పరామర్శ

కపిలేశ్వరపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు సాధనాల శివభగవాన్‌ను గురువారం కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు పరామర్శించారు. శివభగవాన్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఈశ్వరరావు, శ్రీవెంకటరమణ

రామచంద్రపురం: స్థానిక చింతపల్లి సూరన్ననగర్ మున్సిపల్ హైస్కూల్ వద్ద యూటీఎఫ్ పట్టణ శాఖ మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ శాఖ అధ్యక్షుడిగా జి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పెద్దింశెట్టి శ్రీవెంకటరమణ, గౌరవాధ్యక్షునిగా ఎస్‌వీ నాయుడు, సహాధ్యక్షులుగా డి.వీరేంద్ర బాబు, సీహెచ్ చంద్రకాంతం, కోశాధికారిగా డి.ప్రసన్నకుమార్, కార్యదర్శులుగా పి.సూర్యప్రకాశరావు, ఎస్ఎస్ఎస్ సుధీర్, ఎస్.మధు రమీనాక్షి, డి.చినఅప్పారావు, డి.భాగ్యలక్ష్మి, వి.రామకృష్ణ, పీఎస్ దుర్గాప్రసాద్, ఆడిటర్‌గా జీవీ హనుమాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు 'పల్లెకు పోదాం'

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 3 గంటలకు ద్రాక్షారామ–2 గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.


రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ


హసన్‌బాదలో అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భవాని తదితరులు


కోరుమిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట


కేశవరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా పాలన

- సీఎం జగన్‌తో అన్నివర్గాలకూ ప్రాధాన్యం
- 'ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే'లో మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా సీఎం జగన్ అద్భుత పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక కుమ్మర్ల వీధి సచివాలయం వద్ద ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ ప్రతిపక్షాలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తూ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో టీడీపీ నేతలకే పథకాలు అందేవని వివరించారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత ఉంటే చాలు అందరికీ సంక్షేమం అందుతుందన్నారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమచేస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని మంత్రి వేణు వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రతి పేదవాడికి గూడు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో దాచుకో.. దోచుకో అన్నట్లు చంద్రబాబు పాలన సాగిందన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు పని చేసినప్పుడు ఏమీ చేయకపోగా, మరోసారి ఛాన్స్ ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందని వేణు అన్నారు. పేదల చదువుకు పేదరికం అడ్డురాకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేసిందని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని, ప్రస్తుతం సీఎం జగన్ మాత్రం పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సొమ్ము డిపాజిట్ చేస్తున్నారని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు బొక్కా సత్యనారాయణ, వాద్రేవు సాయి ప్రసాద్, కేతా శ్రీను, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఇంట వెలుగులు నింపుతున్నాయని ఎంపీపీ అంబటి భవానీ అన్నారు. హసన్‌బాద గ్రామంలో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించగా జెడ్పీటీసీ సభ్యుడు మేర్నేడి వెంకటేశ్వరరావు, మండల వైస్ ఎంపీపీ శాఖా బాబి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలం పార్టీ అధ్యక్షుడు పలివెల నాగరాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు గ్రామంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. సర్పంచులు కొత్తపల్లి అరుణ, అంబటి తుకారాం, నాయకులు టేకుమూడి సత్యనారాయణ, ఉప సర్పంచ్ నీలం భవాని, ఎంపీడీఓ కీర్తి స్పందన, ఈఓపీఆర్డీ ఎస్.సెలట్ రాజు పాల్గొన్నారు.

కాజులూరు: గొల్లపాలెంలో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ముందుగా గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక ఆధ్వర్యంలో సచివాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు తదితరులు పథకాల లబ్ధిదారులకు సంబంధించిన బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయం ఆవరణలో జరిగిన సభలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నాయకులు వివరించారు. కాజులూరు జంక్షన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పల్లె నిద్ర చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి పద్మజ, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్

కపిలేశ్వరపురం: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన మాటను సీఎంగా బాధ్యత తీసుకున్న కొద్ది నెలలకే నిలబెట్టుకుని దేశంలోనే గుర్తింపు పొందిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రారంభం సందర్భంగా అంగర పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శీలం గోవింద్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధిపై విజన్ ఉన్న నాయకుడుగా వైఎస్ జగన్ సమర్థవంతంగా పాలిస్తున్నారన్నారు. ఆయన ప్రజలకు పారదర్శకంగా మేలు చేస్తున్నారని, గతంలో ప్రజల ఆదరణ కోల్పోయిన ప్రతిపక్షాలు నేడు మరింత దూరమయ్యాయన్నారు. ప్రభుత్వ సంక్షేమంపై ఏమీ మాట్లాడలేక, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లేనిపోని అంశాలపై రచ్చ చేస్తున్నారన్నారు. టీడీపీ పాలన, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై నాడు–నేడు పద్ధతిలో చర్చించడం ద్వారా ఎవరికి ఓటు వేయాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, కిశోర్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయలేనన్నంత స్థాయిలో ప్రతి ఇంటికి ప్రభుత్వ లబ్ధిని చేకూర్చడం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లిలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన గురువారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అర్హతే ఆధారంగా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ సత్యవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శీలం గోవింద్, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట స్వామి, మాజీ సర్పంచ్ సలాది వీర బాబు అన్నారు.

రాయవరం: చరిత్రలో ఎన్నడూ ఎరుగని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతోందని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు పేర్కొన్నారు. మాచవరంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. నేతలు కత్తుల అప్పారావు, త్రినాధరెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం జగనే మళ్లీ సీఎం కావాలి

ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు మరలా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా కేశవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం జగన్‌కు మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని ఆయన కోరారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ప్రచార బోర్డును ఎంపీడీఓ ఐ.రాజు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తిలతోఎంపీపీ శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఆర్బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నేతలు కొప్పిరెడ్డి ప్రసాద్, సలాది శివ, ముక్కపాటి పసన, పలుకూరి వెంకన్నబాబు, బందెల సాయిరాం, అల్లంపల్లి కిషోర్, వార్డు సభ్యుల, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వమే ప్రయోగాలకు మూలం

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో


సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న శ్రీకృష్ణసాయి తదితరులు

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ పరిశోధనలకు ప్రశ్నించేతత్వమే మూలమని రేవతి సైన్స్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పిశెట్టి శ్రీకృష్ణసాయి అన్నారు. స్థానిక సాయితేజా విద్యానికేతన్‌లో మూడు రోజుల నుంచి నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో గురువారం సాయంత్రం ముగిసింది. పాఠశాల అకడమిక్ డైరెక్టరు తేతల భానురేఖసందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలన్నారు. వారిలో శాస్త్రీయ దృక్పథం పెరగడానికి ప్రయోగాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అకడమిక్ డైరెక్టరు భానురేఖసందీప్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 270 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారన్నారు. సైన్స్‌తో పాటు, గణితం, సోషల్ సబ్జెక్టులకు చెందిన ప్రాజెక్టులను కూడా విద్యార్థులు ప్రదర్శించారన్నారు. సైన్స్ ఎక్స్‌పోను వివిధ గ్రామాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు సందర్శించారన్నారు. సైన్స్ ఎక్స్‌పోలో విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్టు పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వరి తెలిపారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, యోగా గురువు తాడి అరవిందం తదితరులు పాల్గొన్నారు.

161మందికి వైద్య పరీక్షలు


అంగరలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం సీహెచ్‌సీలలో 162 మంది గర్భిణులకు గురువారం పరీక్షలు చేసి, మందులను అందజేశారు. 42 మందిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. సీనియర్ గైనకాలజిస్ట్ కన్యాకుమారి, ఆయా పీహెచ్‌సీల వైద్యులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, జీవీ గీతాంజలి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి, సీహెచ్‌సీ వైద్యురాలు వి.లత పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. అంగర పీహెచ్‌సీలో 72 మంది, అచ్యుతాపురంలో 32, వాకతిప్పలో 35, కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో 22 మంది గర్భిణులను పరీక్షించారు. కపిలేశ్వరపురం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కట్టా మురళి, అంగరకు చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావులు గర్భిణులకు బిస్కెట్లు, ఆపిల్ జ్యూస్, డ్రింక్స్, చిక్కీలను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, కామేశ్వరరావు, గోపాలకృష్ణ, సామాజిక కార్యకర్త సంకాబత్తుల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

- 'అమ్మ ఒడి'తో అది సాధ్యం
- మంత్రి వేణుగోపాలకృష్ణ


రామచంద్రపురం మండల పరిషత్తు కార్యాలయంలో పాఠశాలలకు సామగ్రి అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం రూరల్ మండలం, అర్బన్ ప్రాంతాల్లోని 84 ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు, టాయిలెట్ పరికరాలు, లైబ్రరీ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యా సంస్కరణల్లో సీఎం జగన్ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారన్నారు. గతంలో హోటళ్లు, చిన్న చిన్న వ్యాపారాలు తదితర చోట్ల బాల కార్మికులు కనిపించేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి తదితర పథకాలతో నేడు ఆ పరిస్థితి మారిపోయిందన్నారు. రూ.8,08,651 విలువైన వంట పాత్రలు, రూ. 3,21,300 విలువైన లైబ్రరీ పరికరాలు, రూ. 2,79,743 విలువైన టాయిలెట్ పరికరాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, డీవైఈఓ ఫణి, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


కోటిపల్లిలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

కె.గంగవరం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కోటిపల్లి, కుడుపూరు గ్రామాల్లో గురువారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులతో కలసి ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. దీంతోపాటు కూరగాయ, ఇతర వ్యర్థాలను ఇంటి పెరట్లో గొయ్యి తీసి పాతిపెట్టాలన్నారు. తద్వారా ఆ వ్యర్థాలు ఎరువులుగా మారతాయని, వాటిని పంట పొలాలకు, ఇళ్లలో ఉండే మొక్కలకు వేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల శ్రమను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉందని, స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమాన్ని తప్పక చేస్తే తద్వారా కార్మికులపై పనిభారం తగ్గుతుందని తెలిపారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు నాగచైతన్య

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన పోటీల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన మాదాసి నాగచైతన్య ప్రతిభ చూపాడు. ఈ మేరకు గురువారం హెచ్ఎం దొంగ జానకీరామయ్య ఆధ్వర్యంలో నాగచైతన్యను అభినందించారు. అండర్–14 విభాగంలో ప్రతిభ చూపిన చైతన్య 11న బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అతన్ని సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, కోచ్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, చొప్పల చంద్రశేఖర్ అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


కపిలేశ్వరపురంలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట


కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో గురువారం రూ.73.79 లక్షల అంచనా వ్యయంతో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పేదలకు స్థలమూ, నిర్మాణ వ్యయమూ రెండూ ఉచితంగా అందిస్తూ సొంత ఇంటి కలను నెరవేర్చుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ శీలం భాస్కరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శీలం గోవింద్, గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు పీతల బంగారం, అరదాని శ్రీదేవి, చింతా పెద్దకాపు, మల్లిపూడి శివకుమార్, కుడుపూడి విజయ్, పెంటపాటి వెంకన్నబాబు, జిత్తుక వీరన్నబాబు, పిప్పర సంపత్‌రావు పాల్గొన్నారు.

మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

మండపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలన వారి జీవన ప్రమాణాలను ఎంతగానో మెరుగుపర్చిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో గురువారం ఆయన ద్వారపూడిలో పర్యటించారు. సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులతో కలిసి గుర్కావారి బీడు, వెంకటపద్మావతి నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు తీగిరెడ్డి దుర్గ, పార్టీ నాయకులు పోతుల రాంబాబు, సంగిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు కల్పించినా స్థలాలు ఇచ్చి తీరుతా

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అసత్య ప్రచారంతో అభివృద్ధిని అడ్డుకోలేరని విపక్షాలపై మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నేత వేగుళ్ల లీలాకృష్ణ ఏకమై ఎన్ని అడ్డంకులు కల్పించినా జనవరి నెలాఖరవు నాటికి కేశవరం కుర్రావారి మెట్టను లెవిల్ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే ప్రయత్నం చేస్తుంటే అక్రమ తవ్వకాలంటూ అసత్యప్రచారం చేస్తూ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్న బాబుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికలకు రెండు నెలల ముందు ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల హడావుడిగా 380 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. మెట్టను లెవిల్ చేయకుండా ఇళ్ల నిర్మాణం ఏలా చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు లబ్ధిదారులు ఈ విషయమై తమ ఆవేదన వెలిబుచ్చారన్నారు. జగనన్న కాలనీల్లో ప్రజలు సంతోషంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారని, గత టీడీపీ ప్రభుత్వం కుర్రావారి మెట్టలో తమకు ఇచ్చిన పట్టాలు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయని వాపోయారని ఎమ్మెల్సీ తోట తెలిపారు. ఈ మెట్టలోని గ్రావెల్‌తో జగనన్న కాలనీలు, పుంతరోడ్లు మెరక చేయడం ద్వారా స్థలాన్ని లెవిలింగ్ చేసేందుకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారన్నారు. తవ్వకాల కోసం అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం కుర్రావారి మెట్టలో లెవిలింగ్ పనులు జరుగుతుంటే ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ విచిత్ర విన్యాసాలు చేస్తున్నారన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్నారంటూ ఎమ్మెల్యే వేగుళ్లపై గతంలో విమర్శలు చేసిన లీలాకృష్ణ ఇప్పుడు ఆయనతోనే అంటకాగుతుండడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కేశవరం ప్రజలు గత మూడు ఎన్నికల్లో ఎమ్మెల్యే వేగుళ్లకు మెజార్టీ ఇస్తే ఇప్పుడు అదే గ్రామం వెళ్లేందుకు ఆయన పోలీస్ భద్రత కోరడం సిగ్గుచేటని విమర్శించారు. ఇళ్ల స్థలాల పనులు అడ్డుకునేందుకు రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వేగుళ్ల, లీలాకృష్ణ వస్తున్నారని తెలిసి వారికి గుణపాఠం చెప్పేందుకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు చీపుర్లు, టమాటాలు, గుడ్లతో కుర్రావారి మెట్టలో వారి కోసం ఎదురుచూశారన్నారు. ప్రజల నుంచి నిరసన వస్తుందన్న భయంతో ఇరువురు హౌస్ అరెస్టుల డ్రామా ఆడారని విమర్శించారు. పోలీసులు ఉదయం 10 గంటల సమయానికే ఎమ్మెల్యే వేగుళ్లను హౌస్ అరెస్ట్ నుంచి విడుదల చేస్తే నేరుగా కేశవరం వెళ్లకుండా వల్లూరు వెళ్లి లీలాకృష్ణను కలవడం ఏమిటని ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించాలని చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా పేదల సొంతింటి కలను సాకారం చేసే విషయం వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామాల్లోని మెరక చేయాల్సిన భూములు గుర్తించి అధికారులు ద్వారా వాటిని అభివృద్ధి చేసుకోవాల్సింది పోయి రాద్ధాంతం చేయడం సరికాదని హితవు పలికారు. పాపారాయుడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న తమపై ఎమ్మెల్యే వేగుళ్ల ఎన్నో అక్రమ కేసులు బనాయించారన్నారు. మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, పార్టీ నేత పలివెల సుధాకర్, యాండ్ర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ


ట్రోఫీని అందుకుంటున్న అభిషేక్

రామచంద్రపురం: విజయవాడలో జరిగిన ఏపీ సీఎం జగన్– యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో స్థానిక మోడరన్ హైస్కూల్ విద్యార్థి బోను అభిషేక్ అండర్–15 డబుల్స్ కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించి రన్నర్‌గా నిలిచారు. ఈ విషయాన్ని గురువారం మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ అభిషేక్ రూ.15 వేల నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారన్నారు. అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా ప్రతి టోర్నమెంట్‌లో ప్రతిభ చూపుతున్న అభిషేక్ భవిష్యత్‌లో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించాని ఆశాభావం వ్యక్తం చేశారు.

భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ఠ


పల్లిపాలెంలో భగీరథ మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన గ్రామస్తులు

కాజులూరు: పల్లిపాలెంలో భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చెయ్యగా, ఆయన తనయుడు చెల్లుబోయిన నరేన్ స్వచ్ఛందంగా అందజేసిన రూ.25 వేలతో భగీరథ మహర్షి విగ్రహం, మందిరం నిర్మించినట్లు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బి.గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి శ్రీను, నాయకులు కఠారి త్రిమూర్తులు, దండు చిన్నా, రాజు, శింగన్న, మురళీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.